రైతు కంట.. మిర్చి మంట





- మిర్చి రైతుకు ధరాఘాతం
- క్వింటా రూ.10 వేలే
- గత ఏడాది రూ.18 వేలు పలికిన ధర
- దిగుబడులూ అంతంత మాత్రమే..
- సాగు ఖర్చులు కూడా రావంటున్న అన్నదాతలు

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎండు మిర్చి ధర తగ్గడంలో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే సగానికి సగం ధర పడిపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. జూపాడుబంగ్లా మండలంలోని భాస్కరాపురం, తాటిపాడు గ్రామాలకు చెందిన రైతులు కేసీ ఆయకట్టు కింద, పారుమంచాల, తరిగోపుల, మండ్లెం గ్రామాలకు చెందిన రైతులు బోరుబావుల కింద మిర్చి సాగు చేశారు. గతేడాది క్వింటాలు రూ.18 వేల నుంచి రూ.22 వేల వరకు పలికింది. దిగుబడులు కూడా ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు వచ్చాయి. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా పైర్లు తెగుళ్ల బారిన పడ్డాయి. బొబ్బెర, ఆకుముడత, వైరస్ తెగుళ్ల సోకాయి. ఎక్కువ ధరల పురుగు మందులు పిచికారి చేసినా నివారణ కాకపోవడంతో దిగుబడులు సగానికి సగం పడిపోయాయి. ఎకరాకు ఎనిమిది క్వింటాళ్లు కూడా రాలేదు. దిగుబడులు తగ్గిపోయాయని ఆందోళన చెందుతుంటే మరోవైపు ధరలు అమాంతంగా తగ్గిపోవడంతో తీవ్ర నష్టం మిగిలిందని రైతులు వాపోతున్నారు. క్వింటం ధర రూ.10 వేలు కూడా పలకడం లేదని, ఎకరాకు పెట్టుబడి ఖర్చు రూ.లక్షకుపైగా అయిందని, చివరకు అప్పే మిగలనుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



పారుమంచాలలో మిరప దిగుబడులను పరిశీలిస్తున్నరైతు సంఘం నాయకులు

కూలీల డబ్బులు కూడా రావడం లేదు..



ఈ ఏడాది నాలుగెకరాల్లో మిర్చి సాగు చేశాను. ఎకరాకు రూ.లక్ష చొప్పున పెట్టుబడి ఖర్చు పెట్టాను. పైరు పూత, కాయదశ వచ్చిన సమయంలో వర్షాలు, బొబ్బెర, ఆకు ముడత తెగులు సోకాయి. దిగుబడులు కూడా భారీగా తగ్గాయి. అమ్ముకునేందుకు గుంటూరుకు వెళితే అక్కడ వ్యాపారులు ఎంత ధర నిర్ణయిస్తే అంతే ఇవ్వాల్సి వస్తోంది. ప్రభుత్వం మిర్చి రైతులను ఆదుకోవాలి.

- గొల్లమద్దిలేటి, భాస్కరాపురం, మిర్చి రైతు

క్వింటాకు రూ.25 వేలు ఇవ్వాలి

మిర్చి రైతులకు ప్రభుత్వం కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ. 25 వేలు కల్పించాలి. ఎకరాకు రూ.లక్షకుపైగా అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టారు. తెగుళ్లతో పంటలు దెబ్బతిని ఐదు క్వింటాళ్లు కూడా రాలేదు. కౌలు రైతులు పరిస్థితి దయనీయంగా మారింది. ఎకరాకు రూ.30 వేల కౌలు చెల్లించి పంటలు సాగు చేశారు. ధర క్వింటాలుకు రూ.25 వేలు పెంచాలి. నష్టపోయిన మిర్చి రైతులకు పంటల బీమా వర్తింపజేయాలి.

-వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకుడు

రూ.10 వేలు అడుగుతున్నారు..



ఈ ఏడాది తెగులు ఆశించడంతో దిగుబడులు కూడా భారీగా తగ్గాయి. ఎకరాకు ఎనిమిది క్వింటాలు వచ్చే పరిస్థితి లేదు. దీనికితోడు వ్యాపారులు క్వింటాలు రూ.10 వేలకు అడుగుతున్నారు. ఇలాగైతే పెట్టుబడులకు తెచ్చిన అప్పులు కూడా తీరవు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధర అందించాలి. రైతులకు వంద కిలోమీటర్లలోపు పెద్ద మార్కెట్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- రాముడు, మిర్చి రైతు, భాస్కరాపురం

'స్వచ్ఛంద'లో 23వ స్థానం

14 అంశాల పరంగా పరిశీలన



నంద్యాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరిశుభ్రత పెంచేందుకు.. అత్యున్నత ప్రమాణాలు నెల కొల్పే దిశగా అమలు చేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు- కార్యాచరణపై సీఎం నారాచంద్రబాబునాయుడు శుక్రవారం తమ కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహించి ఒక్కో అంశంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ నెల సోర్స్ రీ సోర్స్ అనే అంశాన్ని తీసుకోవచ్చని చెప్పారు. స్వచ్ఛాంధ్ర మిషన్‌లో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని దిశానిర్దేశం చేశారు. ఇదే క్రమంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధి శాఖ, పంచాయతీ రాజ్ శాఖ చేపట్టిన 14 అంశాలకు సంబంధించిన కార్యక్రమాలపై ఆయా అధికారులు సమగ్రంగా జిల్లాల వారిగా పురోగతిని సీఎంకు వివరించారు.

● 14 అంశాలు..
జిల్లాల వారిగా ర్యాంకులు..

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ మరుగుదొడ్లు, డోర్ టు డోర్ కలక్షన్, సాలిడ్ వేస్ట్ సెగ్రిగేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, కమ్యూనిటీ సోక్‌పిట్స్, క్లీన్ విలేజ్, ఒడిఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్ వంటి 14 అంశాలను సీఎంకు వివరించారు. మొత్తంగా 200 పాయింట్ల ఆధారంగా జిల్లాల పురోగతి గుర్తించి జిల్లాల వారిగా ర్యాంకు ప్రకటించారు. ఈ నేపథ్యంలో సదరు 14 అంశాల పరంగా 200 పాయింట్లకు 94 పాయింట్లతో 23వ స్థానంలో నంద్యాల జిల్లా నిలిచింది. మొదట 129 పాయింట్లతో ఎన్టీఆర్, 127 పాయింట్లతో విశాఖ, 125 పాయింట్లతో ఈస్ట్ గోదావరి జిల్లాలు నిలిచాయి. 81 పాయింట్లతో అల్లూరి సీతారామరాజు జిల్లా 26వ స్థానంలో నిలిచింది.

దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయం

కలెక్టర్ రాజకుమారి



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ, దళిత సంఘాల నాయకులు

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దేశానికి, రాష్ట్రానికి దామోదరం సంజీవయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ రాజకుమారి అన్నారు. ఉమ్మడి ఏపీ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104వ జయంతి వేడుకలు కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్, దళిత సంఘాల నాయకులు కలిసి దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలల వేసి నివాళి అర్పించారు. పేద, దళిత వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహోన్నత వ్యక్తి సంజీవయ్య అని కలెక్టర్ కొనియాడారు. పేదల జీవన ప్రమాణాల పెంపునకు ఆనాడే అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి అమలుకు కృషి చేశారన్నారు. కర్నూలు జిల్లాలో నీటి వనరుల సంరక్షణకు గాజులదిన్నె ప్రాజెక్టు, వరదరాజ స్వామి ప్రాజెక్టులకు రూపకల్పన చేసి తాగు, సాగు నీటికి ఇబ్బంది లేకుండా చేశారన్నారు. కార్మిక శాఖ మంత్రిగా, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో అనేక వినూత్న సంస్కరణలను ప్రవేశ పెట్టి కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయడంతోపాటు చిన్న, మధ్యతరహా పరిశ్రమల పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా దేశ భవిష్యత్ కోసం కీలకపాత్ర పోషించారన్నారు. జేసీ విష్ణు చరణ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం వచ్చిన తర్వాత దళితుల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి దామోదరం సంజీవయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, దళిత సంఘాల నాయకులు కొమ్ముపాలెం శ్రీనివాస్, దండువీరయ్య, సతీష్‌కుమార్, సఫాయి కర్మచార కమిటీ సభ్యులు చెన్నమ్మ, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏఈవోకు కేటాయించిన నివాస గృహం రద్దు

● వైసీపీ కార్యకలాపాలకు అడ్డాగా మారడంతో చర్యలు



ఏఈవో సాయి కుమారికి కేటాయించిన ఎంబిజీ 103 గృహం

సున్నిపెంట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలో పని చేస్తూ బదిలీపై వెళ్లిన ఏఈవో కె. సాయి కుమారికి కేటాయించిన వసతి గృహం ఉత్తర్వులను ఎం. శ్రీనివాసరావు శుక్రవారం రద్దు చేశారు. అంతర్గత బదిలీలలో భాగంగా దేవస్థానానికి దత్త దేవాలయమైన కడప జిల్లా సిద్దవటం జ్యోతి సిద్దవటేశ్వర స్వామి దేవస్థానానికి సాయి కుమారిని బదిలీ చేశారు. అయితే అప్పటి నుంచి మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ముఖ్య అనుచరుడు స్థానిక వైసీపీ నాయకుడు ఎం.ఏ. రజాక్ సదరు ఎంబిజిజీ 103 వసతి గృహాన్ని పార్టీ కార్యకలాపాలకు అడ్డాగా మార్చాడు. అన్యమతస్తుడైన రజాక్ బినామి పేర్లతో టెండర్లు దక్కించుకుని సుమారు 20 సంవత్సరాలుగా పనులు చేస్తున్నాడు. గతంలో ఈ విషయమై పలు హిందూ సంఘాలు దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకు వచ్చిన సందర్భాలు వున్నాయి. గత వైసీపీ పాలనలో తాను డీఎస్పీనంటూ శ్రీశైలానికి సరుకులు చేరవేసే ట్రాన్స్‌పోర్టు వారిని బెదిరించి మామూళ్లు వసూల్లు చేయడంతో, ఫోను సంభాషణ ద్వారా స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి రజాక్‌ను రిమాండుకు పంపారు. తాజాగా ఈ నెల 8వ తేదీన దేవస్థానం ఒప్పంద ఉద్యోగి గృహంలో మద్యం సేవిస్తూ పట్టుబడ్డాడు. అన్యమతస్తుడైన రజాక్ వల్ల క్షేత్ర పవిత్రతకు భంగం వాటిల్లడంతో ఏఈవో సాయి కుమారికి కేటాయించిన ఎంజీ 103 నివాస గృహాన్ని ఐదు రోజుల లోపల ఖాళీ చేసి దేవస్థానానికి అప్పగించాల్సిందిగా ఈవో ఎం. శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు.

జనరిక్ మెడికల్ షాపులకు దరఖాస్తులు

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీసీ కార్పొరేషన్ నుంచి జనరిక్ మెడికల్ షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు జాకీర్ హుసేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25కు గాను బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించి లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోందన్నారు. ఇందుకోసం ముందుగా ఏపీఓబీఎంఎంస్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. సబ్సిడీ రుణాల మంజూరుకు సంబంధించి 21నుంచి 60సంవత్సరాల మధ్య వయసుగలవారు అర్హులన్నారు. తెల్లరేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. అర్హులైన వారు ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గిన్నీస్ బుక్‌లో చోటు సంపాదించాలి

- మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మెప్మా పొదుపు సంఘాలు గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించేలా ప్రయత్నించాలని మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ శుక్రవారం పిలుపునిచ్చారు. శుక్రవారం విజయవాడ నుంచి మెప్మా మహిళా, పట్టణ సమాఖ్య ప్రతినిధులు, అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తేజ్ భరత్ మాట్లాడుతూ మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పొదుపు సంఘాలు లక్ష ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించి రూ.2 కోట్ల టర్నోవర్‌తో గిన్నిస్ బుక్‌లో చేరేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో ప్రీ బుకింగ్ జరుగుతున్నట్లు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు మార్చి 8న ఆన్‌లైన్‌లో బుక్ అయిన ఉత్పత్తులను బటన్ నొక్కి ఒకేసారి లక్ష ఉత్పత్తులను డెలివరి చేయిస్తారన్నారు. ఇదే స్ఫూర్తితో మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు.

దళారులను నమ్మకండి : డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల కోసం దళారుల మాటలు నమ్మి అభ్యర్థులు ఎవరూ మోసపోవద్దని కర్నూలు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ జిల్లా వైద్యఆరోగ్యశాఖ పరిధిలో భర్తీ చేస్తున్న ఉద్యోగాల నియామకాలు, భర్తీ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. నియామక ప్రక్రియపై కొందరు వదంతులు సృష్టిస్తూ, నిరుద్యోగులను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ప్రతిభ ఆధారంగానే ఉంటుందన్నారు. ఎంపిక వివరాలు, అభ్యంతరాల స్వీకరణ ఇలా ప్రతీది జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నట్లు తెలిపారు.

గిడ్డంగుల సంస్థకు జవసత్వాలు



ఈ ఫొటోలో కనిపిస్తున్నది నగరంలోని కోడుమూరు రోడ్డు రేడియో స్టేషన్ వద్ద ఉన్న గోడౌన్. దీని సామర్థ్యం ఆరు వేల మెట్రిక్ టన్నులు. గత ఐదేళ్లుగా ఇందులో ఒక్క బియ్యం గింజ కూడా నిల్వ చేయలేదు. సివిల్ కార్పొరేషన్ అధికారులు ఏవేవో కుంటి సాకులు చెప్పడం వల్ల ఈ గోదాములో నిల్వ చేయాల్సిన బియ్యం, ఇతర ఆహారోత్పత్తులు ప్రైవేటు గోదాములకు తరలిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు మళ్లీ జవసత్వాలు కల్పిస్తుండటంతో ఇలాంటి గిడ్డంగులకు పూర్వ వైభవం రానుంది.

- జీవో 565ను నీరుగార్చిన గత వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం మీద ఎస్‌డబ్ల్యూసీ వర్గాల ఆశ
- లక్ష మెట్రిక్ టన్నుల నిత్యావసరాల నిల్వకు కార్యాచరణ
- జీవో 565 అమలుకు ఎస్‌డబ్ల్యూసీ ఎండీ చర్యలు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంట ఉత్పత్తులను భద్రంగా నిల్వ చేసేందుకు, బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేనప్పుడు తాత్కాలికంగా దాచుకొని బ్యాంకుల్లో రుణం తీసుకొనేందుకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాములు ఉపయోగకరంగా ఉండేవి. 1956లో రాష్ట్ర ప్రభుత్వం ఈ గిడ్డంగుల సంస్థ (ఎస్‌డబ్ల్యూసీ)ను ఏర్పాటు చేసింది. రైతుల పంట ఉత్పత్తులను భద్రపరచడమే కాకుండా సివిల్ సప్లయ్, నాఫెడ్, మార్క్‌ఫెడ్ తదితర సంస్థలకు గోదాములను సమకూర్చే బాధ్యతను కూడా ఈ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకే ప్రభుత్వం అప్పగించింది. అయితే ఈ రాష్ట్ర గిడ్డంగుల సంస్థను నిర్వీర్యం చేసే మహాకుట్రకు గత సీఎం జగన్ రెడ్డి పాల్పడ్డారు. ఈ సంస్థకు జవసత్వాలు కల్పించడం కోసమని 2022 సెప్టెంబరు 1న జీవోఆర్‌టి. నెం. 565ను తీసుకొచ్చారు. ఈ జీవో ద్వారా రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. ప్రజల అవసరాల కోసం మార్క్‌ఫెడ్, సివిల్ సప్లయ్, నాఫెడ్ తదితర సంస్థలకు అవసరమైన బియ్యం, కందులు, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తులను సేకరించి గోదాముల్లో నిల్వ చేసే బాధ్యతను రాష్ట్ర గిడ్డంగుల సంస్థనే చేపట్టాలని, నోడల్ ఏజెన్సీగా ఈ సంస్థనే బాధ్యత తీసుకోవాలని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాం వరకు ఈ సంస్థ కార్యకలాపాలు విస్తృతంగా జరిగాయి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో జీవోను సృష్టించి, క్రమంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో ఉన్న గోదాములను కూడా శిథిలావస్థకు చేర్చారు. గోదాముల మరమ్మతులకు ఒక్క రూపాయి నిధులను కూడా మంజూరు చేయలేదు. దీంతో ఆ గోదాములన్నీ పంట ఉత్పత్తుల నిల్వకు ఏ మాత్రం పనికి రాకుండా పోయే పరిస్థితిని తీసుకువచ్చారు. ఇదే అదునుగా వైసీపీ నేతలు ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో పంట ఉత్పత్తులను నిల్వ చేసే అవకాశం లేదని ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో ఉన్న గోదాములను అద్దె ప్రాతిపదికన తీసుకుని నిత్యావసరాల వస్తువుల నిల్వకు ప్రభుత్వ అనుమతి ఇవ్వాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారు. వారి కుట్ర ఫలించడంతో సివిల్ సప్లయ్ సంస్థతో పాటు మార్క్‌ఫెడ్, నాఫెడ్ తదితర సంస్థలన్నీ నాయకులు, వ్యాపారుల ఆధ్వర్యంలో ఉన్న గోదాముల్లోనే బియ్యం, కందులు, మొక్కజొన్నలు తదితర వాటిని నిల్వ చేయించారు. మరో వైపు సివిల్ సప్లయ్ గోదాముల్లో నిల్వ ఉంచిన బియ్యాన్ని పక్కదారి పట్టించేసి కోట్లు దండుకునే దుర్మార్గానికి తెర లేపారు.

మిగతా 6వ పేజీలో...

నేడు ఆకాశవాణి కర్నూలు కేంద్రంలో
'కిసాన్ దినోత్సవం'

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నగరంలో బళ్లారి రోడ్డులోగల ఆకాశవాణి కర్నూలు కేంద్రంలో శనివారం ఉదయం 11 గంటలకు 'కిసాన్ దినోత్సవం' నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఆకాశవాణి కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ దేవరబొట్ల మురళి ఒక ప్రకటనలో తెలిపారు. ఆకాశవాణి కేంద్రంలో ఏటా ఫిబ్రవరి 15న రేడియో కిసాన్ దినోత్సవం నిర్వహిస్తున్నామని, ఈ నేపథ్యంలో 'కిసాన్‌వాణి' ప్రసారాల సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ రైతు సాధికార సంస్థ, ఏపీ కమ్యూనిటీ మానేజ్‌డ్ నేచురల్ ఫార్మింగ్ చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అధికారి డాక్టర్ వి.లక్ష్మినాయక్, విశిష్ట అతిథిగా నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అధికారి డాక్టర్ ఎం.జాన్సన్, గౌరవ అతిథులుగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పీఎల్ వరలక్ష్మి, పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని రైతులు కూడా ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హాజరై, వ్యవసాయ, సాంకేతిక విషయాలపట్ల అవగాహన కలిగించుకోవాలని సూచించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి: డీఈవో



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

మహానంది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో జనార్దన్‌రెడ్డి సూచించారు. ఎం.తిమ్మాపురంలోని కేజీబీవీని శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థినులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. విద్యార్థినుల సమస్యలను తెలుసుకున్నారు. వంట గదితో పాటు పాఠశాల పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో రామసుబ్బయ్య పాల్గొన్నారు.

నంద్యాలలో జేఎన్టీయూ, కేంద్రీయ విశ్వవిద్యాలయం
మంత్రి ఫరూక్



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి

నంద్యాల మున్సిపాలిటీ ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో జేఎన్టీయూ, కేంద్రీయ విశ్వవిద్యాలయతో పాటు జవహర్ నవోదయ విద్యాలయానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. మంత్రి శుక్రవారం తన స్వగృహంలో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల, గోస్పాడు మండలాల్లో విద్యాశాఖకు సంబంధించి పలు అపరిష్కృత పనుల పూర్తికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఆయా పాఠశాలల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు ప్రేమంత్ కుమార్, అస్మద్దిన్, బ్రహ్మం నాయక్, జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా తిరుగు రథోత్సవం

కోడుమూరులో ఘనంగా కొనసాగుతున్న చౌడేశ్వరీదేవి ఉత్సవాలు



భక్తుల కోలాహలం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోడుమూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కోడుమూరు చౌడేశ్వరీదేవి తిరుగు రథోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే రథానికి పూజ కార్యక్రమాలను ముగిసిన అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై కొలువుంచి తిరుగు రథోత్సవం నిర్వహించారు. తిరుగు రథోత్సవ వేడుకలను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో పట్టణ పుర వీధులు జనంతో నిండిపోయాయి. సీఐ తబ్రేజ్, ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుతీరారు.

అలరించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్

చౌడేశ్వరిదేవి తిరుణాల సందర్భంగా మన ఊరు మన జాతర కార్యక్రమాల స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సంత మార్కెట్లో శుక్రవారం రాత్రి చేపట్టిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం ప్రజలను అలరించింది. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్ విద్యార్థులు నృత్య ప్రదర్శన ప్రజలను ఉత్తేజ పరిచింది. దేశ భక్తి, కూచిపూడి, భరతనాట్యంతో పాటు వివిధ సినిమా పాటలకు విద్యార్థులు వేసిన స్టెప్పులకు సంత మార్కెట్ మైదానం ఈలలు, చప్పట్లతో మార్మోగింది. వేదికపై మిమిక్రీ ఆరిస్టు ఉస్మాన్‌బాషా తన మిమిక్రీతో ప్రజలను కడుపుబ్బా నవ్వించారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు లాయర్ ప్రభాకర్, నాగేశ్వరరావు, బలరాం, నటరాజ్, మధు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు విశేష స్పందన :

స్థానిక తేరుబజారులో శుక్రవారం ఉదయం నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళ నుంచి విశేష స్పందన వాటిల్లింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన ముగ్గురికి వెండి కుంకుమ భరిణిలను అందజేయనున్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న జడ్జిలు



గెలుపొందిన క్రికెట్ జట్టుకు కప్పును అందిస్తున్న డాక్టర్ రఘురామిరెడ్డి

ముగిసిన రాయలసీమ ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు :

గత రెండు రోజులుగా సాగిన రాయలసీమ జోన్ ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. పోటీలకు 32 టీంలు వచ్చాయి. రెండు రోజుల పాటు జరిగిన హోరాహోరీ పోటీల్లో అనంతరం జట్టు మొదటి స్థానంలో, నంద్యాల జట్టు రెండో స్థానంలో, మూడో స్థానంలో ఎమ్మిగనూరు, నాలుగో స్థానంలో కోడుమూరు జట్టు గెలుపొందాయి. గెలుపొందిన జట్లకు రూ.10వేలు, రూ.7500, రూ.5వేలు, రూ.3వేల నగదును అందించారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

కోడుమూరు చౌడేశ్వరీ దేవి జాతర పురస్కరించుకొని ఈ నెల 3న ప్రారంభమైన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. దాదాపు 11 రోజుల పాటు సాగిన ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 30 క్రికెట్ జట్లు వచ్చాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీలల్లో చివరకు ఎమ్మిగనూరుకు చెందిన మహేంద్ర లెనిన్ టీం మొదటి బహుమతి రూ.50వేల నగదును గెలుచుకుంది. రెండో బహుమతి రూ.25 వేల నగదును కోడుమూరుకు చెందిన స్టార్ బాయ్స్ టీం, మూడో బహుమతి రూ.10 వేలను కోడుమూరుకు చెందిన అబిస్టార్ టీం గెలుచుకుంది. గెలుపొందిన టీంలకు బహుమతి దాతలు పాలవారి భాస్కర్‌రెడ్డి, సురేంద్ర, ఎ.యం ఆటోమొబైల్స్, 2004-2005 పూర్వ విద్యార్థులు నగదును అందజేశారు.





నృత్యం చేస్తున్న చిన్నారులు

గిడ్డంగుల సంస్థకు
జవసత్వాలు

(5వ పేజీ తరువాయి)

● కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం జరిగేనా..?

గత వైసీపీ పాలనలో సివిల్ సప్లయ్‌తో పాటు మార్క్‌ఫెడ్, ఆయిల్ ఫెడ్, నాఫెడ్ సంస్థలు బియ్యం, ఇతర పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధీనంలోని గోదాములకు ప్రాధాన్యత ఇవ్వకుండా వైసీపీ నేతల కనుసన్నల్లో ఉన్న గోదాములకే ప్రాధాన్యత ఇచ్చారు. ఈ కారణంగానే రైతుల పంట ఉత్పత్తులు, అదేవిధంగా బియ్యం పక్కదారి పట్టాయి. భారీ ఎత్తున ప్రభుత్వానికి నష్టం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతోనే ఈ అక్రమాలన్నీ వెలుగు చూశాయి. ఇకపై సివిల్ సప్లయ్‌కు చెందిన బియ్యం ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లోనే నిల్వ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లయ్ సంస్థ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్‌డబ్ల్యూసీ సంస్థ అధికారులు తెలిపారు. అయితే.. సివిల్ సప్లయ్ సంస్థ ఉన్నతాధికారులు కొందరు వైసీపీ నేతల ఆదేశాలనే ఇంకా పాటిస్తూ వస్తుండటంతో ఎస్‌డబ్ల్యూసీ అధికారుల్లో ఆందోళన మొదలైంది. కర్నూలు నగరంలోని రేడియో స్టేషన్ వద్ద 6 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని నిల్వ చేస్తామని చెప్పిన సివిల్ సంస్థ అధికారులు ఇప్పుడు మళ్లీ కుంటి సాకులతో ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో బియ్యం నిల్వ చేయకుండా ప్రభుత్వానికి వివిధ కారణాలు చెప్పినట్లు విశ్వసనీయం సమాచారం అందింది.



● కాగితాలకే నోడల్ ఏజెన్సీగా ఎస్‌డబ్ల్యూసీ సంస్థ:

జగన్ తెచ్చిన జీవో 565 ప్రకారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ నోడల్ ఏజెన్సీగా పని చేయాలి. సివిల్ సప్లయ్, మార్క్‌ఫెడ్, ఆయిల్ ఫెడ్, నాఫెడ్ తదితర సంస్థలకు బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను సమకూర్చి గోదాముల్లో నిల్వ చేయాలి. అయితే గత ఐదేళ్లుగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ నోడల్ ఏజెన్సీగా పని చేసిన దాఖలా లేదు. వైసీపీ ప్రభుత్వం తమ సంస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆ సంస్థ అధికారులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రభుత్వ హయాంలో మార్క్‌ఫెడ్, సివిల్ సప్లయ్ తదితర సంస్థలు బియ్యం, కందులు, మొక్కజొన్న మొదలైన వాటిని కొనుగోలు చేసి అవసరమైన గోదాములను ఏర్పాటు చేసే బాధ్యతను రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఏర్పాటైన అధికారుల కమిటీకి ఏ మాత్రం అధికారాలు లేకుండా చేశారనే ఆరోపణ ఉంది. దీంతో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కాగితాల్లోనే నోడల్ ఏజెన్సీగా మిగిలిపోయిందని ఆ సంస్థ అధికారులు చెబుతున్నారు.

● కూటమి ప్రభుత్వంతో ఎస్‌డబ్ల్యూసీకి జవసత్వాలు:

గత వైసీపీ ప్రభుత్వంలో అలంకార ప్రాయంగా ఉండిపోయిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కూటమి పాలనలో మళ్లీ బలోపేతమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ప్రధానంగా సివిల్ సప్లయ్ అధికారులు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాములు బియ్యం నిల్వ చేసేందుకు ఏ మాత్రం పనికిరావని ప్రభుత్వానికి నివేదిక పంపడమే కాకుండా ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో ఉన్న గోదాముల్లో బియ్యాన్ని నిల్వ చేసేందుకు అనుకూలమని ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఆనాటి అధికార పార్టీలోని పెద్దల వత్తాసుతో బియ్యం నిల్వలు ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలోని గోదాముల్లోకి చేర్చారు. ఈ కొత్త నిర్ణయంతో ఆ పార్టీ నేతలు, వారి అనుచరులు రూ.కోట్లు దండుకోవడంపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. ఈ దురాగతాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం మళ్లీ ఎస్‌డబ్ల్యూసీ సంస్థకు జవసత్వాలు కల్పించాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఆ సంస్థ అధికార వర్గాలు తెలిపాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 40 వేల మెట్రిక్ టన్నులు నిల్వ చేసేందుకు ఎస్‌డబ్ల్యూసీ సంస్థకు గోదాములు ఉన్నాయి. సివిల్ సప్లయ్ అధికారులు ఈ గోదాములు పనికి రావని, కుంటి సాకులు చెప్పడంతో ఆ గోదాముల్లో బియ్యం నిల్వ చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం రావడంతో ఈ గోదాములకు మళ్లీ మహర్దశ పట్టనుంది. ఎస్‌డబ్ల్యూసీ రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మెట్రిక్ టన్నుల నిత్యావసరాల వస్తువులను నిల్వ చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను అమలు చేసేందుకు నిర్ణయించారు. దీనికి సంబంధించి ఆ సంస్థ ఉన్నతాధికారులు ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌డబ్ల్యూసీ గోదాములు ఎంత మేర శిథిలావస్థకు చేరాయో గుర్తించి వాటి మరమ్మతులకు అవసరమైన నిధులను మంజూరు చేయించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు సమాచారం.

● ఎస్‌డబ్ల్యూసీ గోదాములకు మహర్దశ కల్పిస్తాం



ఎస్‌డబ్ల్యూసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు సంస్థ ఆధ్వర్యంలో ఉన్న గోదాములను బలోపేతం చేసేందుకు చర్యలు చేపడతాం. గోదాముల మరమ్మతులకు నిధులు ఎంత అవసరయో గుర్తించి ప్రభుత్వానికి నివేదికను పంపుతున్నాం. మా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మెట్రిక్ టన్నుల నిత్యావసర వస్తువులు మా గోదాముల్లో నిల్వ చేసేలా కార్యాచరణ ప్రణాళిక తయారవుతుంది.

- షాకీర్ హుశేన్, రీజనల్ మేనేజర్

వంద రోజుల పని కల్పించండి

కలెక్టర్ పి.రంజిత్ బాషా



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 30వేల కుటుంబాలకు వంద రోజులు పనులు కల్పించడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఉపాధి హామీ పథకం, గ్రామ వార్డు సచివాలయాల కార్యక్రమాలు, స్వచ్ఛతా దివస్ అంశాలపై నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు మున్సిపల్ కమిషనర్లు ఎపీడీలు, ఎంపీడీవోలు ఏపీవోలు, డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించడంలో ఓర్వకల్లు, వెల్దుర్తి, ఆదోని, నందవరం, ఎమ్మిగనూరు, కోసిగి, కృష్ణగిరి పెద్దకడుబూరు గోనెగండ్ల, మండలాలు 70 శాతంలోపు మాత్రమే పనిదినాలు కల్పించారన్నారు. గోకులాల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. జీఎస్ డబ్ల్యూఎస్‌కి సంబంధించి హౌస్ హోల్డ్ జియో కోఆర్డినేట్లు చేయడంలో కౌతాళం, ఆదోని అర్బన్, ఆదోని రూరల్, కర్నూలు అర్బన్ ఎమ్మిగనూ రు అర్బన్‌లో చాలా పెండింగ్ ఉన్నాయన్నారు. అంగన్‌వాడీలో ఉన్నటువంటి 0-6 ఏళ్ల పిల్లల ఆధార్ ఎన్‌రోల్‌మెంటు చేయడంలో జిల్లా చాలా వెనుకబడి ఉందన్నారు. రేపు మూడో శనివారం సందర్భంగా జిల్లా అంతటా స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించాల న్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీవో సందీప్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, జడ్పీ సీఈవో నాసర రెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య పాల్గొన్నారు.

రేపు నరసం 7వ రాష్ట్ర సదస్సు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) రాష్ట్ర సదస్సు ఆదివారం కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు కేవీ సుబ్బలక్ష్మమ్మ, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి తెలిపారు. శుక్రవారం నగరంలోని టీజీవీ కళా క్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, తెలుగుభాషా వికాస ఉద్యమం సంస్థ రాష్ట్ర కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ, ఎం.లక్ష్మయ్య, నరసం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ సుబ్బలక్ష్మమ్మ, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, కార్యదర్శి పసుపులేటి నీలిమ తదితరులు హాజరై నరసం 7వ వార్షికోత్సవ రాష్ట్ర సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీ సుబ్బలక్ష్మమ్మ, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి మాట్లాడుతూ నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ రాష్ట్ర సభలు వివిధ సెషన్లలో కొనసాగుతాయని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కవయిత్రులు, రచయిత్రులు హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఏటా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక రుగ్మతలు, మహిళా సమస్యల పరిష్కార సాధనకు చైతన్యం తీసుకు వస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది 7వ వార్షికోత్సవ రాష్ట్ర సదస్సులో పుస్తక ప్రదర్శనలు, పుస్తక ఆవిష్కరణలు, కవి సమ్మేళనాలు, వివిధ అంశాలపై చర్చాగోష్టులు ఉంటాయని వివరించారు. ఉమ్మడి జిల్లాలోని సాహిత్యాభిలాషులైన మహిళలు ఈ సదస్సునకు విచ్చేసి విజయవంతం చేయాలని వారు కోరారు.



రాష్ట్ర సదస్సు పోస్టర్లు విడుదల చేస్తున్న నరసం ప్రతినిధులు

రైతులకు పింఛన్!

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రతి నెలా రూ.3 వేల పింఛన్ ఇస్తున్నట్లు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జేడీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ప్రధాన మంత్రి కిసాన్ మారథాన్ యోజనా పథకం రైతుల కోసం అమలు చేస్తున్నామని చెప్పారు. రైతు కొంత మొత్తాన్ని బ్యాంకులో చెల్లిస్తే అందుకు మూడురెట్లు ప్రభుత్వం కలిపి ప్రతి నెలా రూ.3 వేల పింఛన్ ఇస్తుందని స్పష్టం చేశారు. 2019లో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలులోకి తెచ్చిందని, చిన్న, సన్నకారు రైతులను ఆర్థికం గా ఆదుకోవడమే లక్ష్యంగా ఈ పథకం అమలవుతుందని తెలిపారు. పథకంలో చేరిన రైతు మరణిస్తే అతని భార్యకు ప్రతి నెలా రూ.1,500 పింఛన్ అందుతుందని వెల్లడించారు. అధికారిక వెబ్‌సైట్ www.pmkmy.gov.in ద్వారా అప్లయ్ చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

తపాలా శాఖను ప్రైవేటుపరం చేయకండి

• జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల నిరసన



హెడ్ పోస్టాఫీసు వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖను ప్రైవేటుపరం చేస్తే సహించేది లేదని తపాలా శాఖ జేఏసీ హెచ్చరించారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రధాన తపాలా కార్యలయం ఎదుట ఎన్ఎఫ్‌పీసీ, ఎఫ్ఎన్‌పీఓ, ఏఐజీడీఎస్‌యూ, ఎన్‌యూ జీడీఎస్ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తపాలా ఉద్యోగుల పీ4 రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో మంత్రి నిర్మలా సీతారామన్ తపాలా శాఖను మూడు ముక్కలుగా చీల్చి ప్రభుత్వ సొమ్మును ప్రైవేటు వ్యక్తులకు అంటగట్టే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. ప్రైవేటు పరం చేస్తే 150 సంవత్సరాల తపాలా శాఖ ఉనికి కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పీ3 కార్యదర్శి గిరిబాబు, పీ4 సెక్రటరీ మహ్మద్‌జానీ, సుమంత్, శివకుమార్ రెడ్డి, బి.లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు వేధిస్తున్నారు

• సెల్ఫీ వీడియోతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



పురుగుల మందు డబ్బాతో చిన్నపుల్లయ్య

ఆత్మకూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులతో టీడీపీ నాయకులు తనను వేధిస్తున్నారని ఓ వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం ఆత్మకూరు మండలంలో జరిగింది. చిన్నదేవళాపురం గ్రామానికి చెందిన చిన్నపుల్లయ్య ఆత్మకూరు మండలంలోని శ్రీపతిరావుపేట మలుపు వద్ద శుక్రవారం మధ్యాహ్నం పురుగుల మందు డబ్బాతో సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. బండిఆత్మకూరు మండలానికి చెందిన టీడీపీ నాయకులు లింగారెడ్డి, వరకంచి శంకరన్న, మద్దినేని శివకృష్ణ, మద్దినేని శివుడు, మద్దినేని నవీన్ తన ఆత్మహత్యకు కారణమని సెల్ఫీ వీడియోలో చెప్పారు. వైసీపీకి అనుకూలంగా పని చేయడంతో టీడీపీ నాయకులు అక్రమ కేసులతో తనను వేధిస్తున్నారంటూ పురుగుల మందు తాగారు. సమాచారం తెలుసుకున్న బంధువులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. చిన్నపుల్లయ్యను హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఆత్మకూరు అర్బన్ సీఐ రామును వివరణ కోరగా.. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు వాంగ్మూలం ఇవ్వలేని పరిస్థితుల కారణంగా కేసు నమోదు చేయలేదని చెప్పారు. బాధితుడు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని చెప్పారు. గురువారం ఎరువుల పంపిణీలో చోటు చేసుకున్న వివాదంపై పోలీసులు చిన్నపుల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. దీంతో ఏ తప్పు చేయనప్పటికీ తనపై అక్రమ కేసులను బనాయించడం వల్లే ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ లాంఛనాలతో డీఎస్పీ అంత్యక్రియలు



డీఎస్పీ అంత్యక్రియల్లో ఫైరింగ్ చేస్తున్న పోలీసులు

ఆస్పరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయంలో డీఎస్పీగా పనిచేస్తూ అనుమానాస్పదంగా మృతి చెందిన బి.నాగరాజు అంత్యక్రియలు శుక్రవారం ఆయన స్వగ్రామం ఆస్పరిలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా ఆధ్వర్యంలో నలుగురు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు మస్తాన్‌వలి, పోలీసు సిబ్బంది అంతక్రియలో పాల్గొన్నారు. రౌండ్లు పేల్చి నివాళి అర్పించారు.

చిరుతపులి దాడిలో గొర్రెలు మృతి

పాణ్యం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుగాలిమెట్ట సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని అడవిలో గొర్రెల మందపై చిరుతపులి దాడి చేసినట్లు గొర్రెల కాపరి వడితే భీమానాయక్ తెలిపారు. శుక్రవారం గొర్రెలను మేపడానికి అటవీ ప్రాంతంలోకి వెళ్లగా హఠాత్తుగా చిరుతపులి గొర్రెల మందపై దాడి చేసి రెండు గొర్రెలను చంపినట్లు తెలిపారు. మూడు గొర్రెలు గాయపడినట్లు తెలిపారు. దాడి సమయంలో భయపడి కేకలు వేయడంతో చిరుతపులి గొర్రెలను విడిచి పారిపోయినట్లు తెలిపారు. వివరణ కోసం ఎఫ్ఆర్‌వో సుబ్బారాయుడును ఫోన్ ద్వారా ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



గాయపడిన గొర్రెలతో కాపరి

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామక్క అనే వృద్ధురాలు శుక్రవారం మృతి చెందినట్లు కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు. జోళదరాశి గ్రామానికి చెందిన రామక్క గురువారం (90) కోవెలకుంట్ల నుంచి సంత మార్కెట్ మీదుగా సౌదరిదిన్నెకు నడుచుకుంటూ వెళ్తోంది. కోవెలకుంట్ల నుండి బైకుపై ముల్లహుసేన్‌బాషా అనే వ్యక్తి బైకుపై వెళుతూ సంత మార్కెట్ వద్ద రామ్మక్కను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆమెను కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించి అక్కడ నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పొలం రస్తా విషయంలో ఘర్షణ

• వ్యక్తిపై కేసు నమోదు

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పొలం రస్తా విషయంలో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. శుక్రవారం ఎస్ఐ భూపాలుడు తెలిపిన ప్రకారం.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తికి చిన్నకొప్పెర్లలో పొలం ఉంది. ఆ పొలాన్ని వెలగటూరుకు చెందిన రామచంద్రుడు కౌలుకు తీసుకున్నాడు. అలాగే గోవిందిన్నె గ్రామానికి చెందిన రమేష్ రెడ్డికి కూడా చిన్నకొప్పెర్ల గ్రామంలో ప్రసాద్ పొలం పక్కనే పొలం ఉంది. శుక్రవారం రామచంద్రుడు, రమేష్ రెడ్డిలు పొలం రస్తా విషయంలో ఘర్షణ పడ్డారు. రామచంద్రుడుపై రమేష్ రెడ్డి దాడి చేశాడు. రామచంద్రుడుకు గాయాలు కావడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో రమేష్ రెడ్డిపై కేసు నమోదైంది.

కర్నూలు డీసీసీ అధ్యక్షుడిపై వేటు..!

• సస్పెండ్ చేస్తూ ఏపీసీసీ ప్రకటన
• నిర్ణయాన్ని శిరసావహిస్తా : మురళీకృష్ణ



కాంగ్రెస్ పార్టీ కార్యాలయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



వారం రోజులుగా జరుగుతున్న సంఘటనలో భాగంగా అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాన్ని శిరసావహిస్తానని మాజీ డీసీసీ అధ్యక్షుడు పి.మురళీ కృష్ణ వెల్లడించారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి తాను తప్పుకుంటున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఇన్నాళ్లు విజయవంతంగా కార్యక్రమాలు చేపట్టామన్నారు. నాయకులు, కార్యకర్తల సహకారంతో పార్టీ అభివృద్ధికి కృషి చేశానని ప్రకటనలో తెలిపారు.

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు పి.మురళీకృష్ణను ఏపీసీసీ అధ్యక్షు రాలు వైఎస్ షర్మిల తొలగించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన్ను జిల్లా అధ్యక్ష స్థానం నుంచి తొలగిస్తూ నోట్ జారీ చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం భవనం పేరుతో సొసైటీ ఏర్పాటు చేయడంతో పాటు పలు ఆరోపణలతో పార్టీ సీనియర్ నాయకులు ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. ఏపీ పీసీసీ కార్యాలయం వెంటనే స్పందించి జరిగిన ఘటనపై విచారణకు ఆదేశించింది. రాష్ట్ర నాయకత్వం జోక్యం చేసుకుని సొసైటీని కూడా రద్దు చేయించింది. సీడబ్ల్యూసీ ప్రత్యేక సభ్యుడు గిడుగు రుద్రరాజును జరిగిన ఘటనపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కోరింది. ఈ మేరకు జరిగిన సంఘటన వాస్తవ మేనని, డీసీసీ అధ్యక్షుడితో పాటు కమిటీలోని సభ్యులు కూడా ఇం దుకు బాధ్యులేనని, వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవస రం ఉందని పార్టీ హైక మాండ్‌కు నివే దిక ఇచ్చారు. స్పం దించిన పీసీసీ అధ్య క్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ముర ళీకృష్ణను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే బాధ్యతల నుంచి తప్పుకోవాలని ఆదే శించారు. ఆదేశాలు వెలువడిన వెంటనే కార్యాల యంలో నగర అధ్యక్షుడు జిలానీ బాషా నాయ కత్వంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు కె.బాబు రావు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.బ్రతుకన్న, లాజరస్, అనంతరత్నం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎవరైనా కాంగ్రెస్ పార్టీ ఆస్తుల జోలికి వస్తే ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఐక్యంగా పోరాటాలు చేసి పార్టీని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

కళ్లను సంరక్షించుకోవాలి: మంత్రి



విద్యార్థినికి కళ్లజోడు పెడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ట్యాబ్‌లు, సెల్‌ఫోన్లను అధికంగా వినియోగించి కంటి చూపునకు దూరమవుతున్నారని, ఆటపాటలు, చదువు మీద ఏకాగ్రతతో చూపును సంరక్షించుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచించారు. నంద్యాల క్రాంతినగర్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం కంటి అద్దాల పంపిణీ నిర్వహించారు. మంత్రితో పాటు కలెక్టర్ రాజకుమారి, డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ, డా.మాధవీలత, జిల్లా అంధత్వ నివారణ అధికారి డా.సిసిలియా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 19.60 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమస్యలున్న వారికి ప్రభుత్వం కళ్లద్దాలు పంపిణీ చేస్తోందన్నారు. 90వేలమంది విద్యార్థులకు కళ్లద్దాలు ఇవ్వాలని వైద్యులు సూచించారని, అందుకు ప్రభుత్వం రూ.2.5 కోట్లు వెచ్చించి విద్యార్థులకు అద్దాలను ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థులు కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడకుండా ఎ-విటమిన్ గల ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో కంటి సమస్యలున్న 44మంది విద్యార్థులకు మంత్రి ఫరూక్, కలెక్టర్‌లు కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

నవోదయలో ముగిసిన రాజ్య పురస్కార్ టెస్టింగ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సబ్ కలెక్టర్ మౌర్యాభరద్వాజ్

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమైన రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాపు శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి 16 నవోదయ విద్యాలయాల నుంచి స్కౌట్స్, గైడ్స్ 91, గైడ్స్ విద్యార్థులు 108 మంది హాజరయ్యారు. చివరి రోజు ముఖ్య అతిథిగా సబ్ కలెక్టర్ మౌర్యాభరద్వాజ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నవోదయ విద్యాలయాల్లో చదవడం ఓ అదృష్టమని, ఇక్కడ చదివిన విద్యార్థులు గొప్పస్థాయిలో ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అన్ని భాషలపై పట్టు పెంచుకోవచ్చని తెలిపారు. విద్యాలయంలోని గ్రంథాల యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ చందిరన్, శ్రీనివాసరావు, వెంకటేష్, బాబురావు నింబురే, మల్లేశ్వరి పాల్గొన్నారు.

పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి

నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పని చేస్తున్న పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న 13 మంది పోలీస్ సిబ్బంది మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీలపై ఎస్పీకి విన్నవించుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. విధి నిర్వహణలో సతమత మవకుండా ప్రజలకు సేవలందించేలా చేయడమే లక్ష్యమని చెప్పారు.

నిమిషాల్లోనే నేరస్తుల చిట్టా



పరికరాలను అందజేస్తున్న ఎస్పీ



పరికరాలను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇక నిమిషాల్లోనే నేరస్తుల చిట్టా విప్పేయవచ్చు. క్షణాల్లోనే నేరస్తుల వేలిముద్రలతో వారి బాగోతం బయటపెట్టవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. శుక్రవారం సీఐడీలోని ఫింగర్ ప్రింట్స్ బ్యూరో విభాగం నుంచి కర్నూలుకు ఐదు ఫింగర్ ప్రింట్స్ లైవ్ స్కానర్స్, 8 మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్ పరికరాలు వచ్చాయి. ఈ పరికరాల పని తీరును ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ హాలులో పరిశీలించారు.

అందుబాటులోకి అత్యాధునిక పరికరాలు

అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందికి వాటి వినియోగంపై పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు దొంగల ఆటకట్టించేందుకు, నేరాల కట్టడికి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామన్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని కర్నూలు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ల పోలీసులు వినియోగించే విధంగా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోనే నేరస్తులు, అనుమానితుల వేలిముద్రలను వేగంగా కచ్చితత్వంగా సేకరిస్తామన్నారు.

డిజిటల్‌గా వేలిముద్రలను భద్రత పరచాలి:

విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా రాత్రి, పగలు సమ యాల్లో, జాతరలు, ఉత్సవాలు, బందోబస్తు, అనుమానిత ప్రాంతాలు, గస్తీ విధులలో ఉన్న పోలీసులు అనుమా నితులను ఆరా తీసి వారి వేలిముద్రలను సేకరించాలని సూచించారు. ఇదివరకే దొంగతనాలకు పాల్పడిన వారి నేరాల వివరాలు, ఫొటోలు వేలిముద్రలు ఇప్పటికే సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచామన్నారు. వీరు భవిష్యత్తులో ఎక్కడైనా ఎలాంటి నేరానికి పాల్పడినా వేలిముద్రల సాయంతో వెంట నే దొరికే అవకాశం ఉందన్నారు. సేకరించిన వేలిముద్రలను సెంట్రల్ సర్వర్‌కు అనుసంధానం చేయాలన్నారు. అనుమా నితులను ఆరా తీయడంలో విధుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించవద్దని పోలీసు అధికారులకు సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నేరస్తులు కొత్త పద్ధతుల్లో చోరీలకు పాల్పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ తేజోమూర్తి, ఫింగర్ ప్రింట్ సీఐ పవన్ కుమార్ రెడ్డి, పత్తికొండ సీఐ జయన్న, ఎమ్మిగనూరు సీఐ శ్రీనివాసులు, ఆలూరు సీఐ వెంకట చలపతి ఉన్నారు.

వైద్య వృత్తిలో క్యారెక్టర్ అవసరం

• సీటీవీఎస్ విభాగాధిపతి డా.సి.ప్రభాకర్ రెడ్డి
• ఎంబీబీఎస్ పూర్తి చేసిన వైద్యులకు ఎథిక్స్‌పై అవగాహన



కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి వైద్యుడు రోగుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలని, వైద్య వృత్తిలో క్యారెక్టర్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని కార్డియోథొరాసిక్ విభాగపు హెచ్‌వోడీ, సీనియర్ ప్రొఫెసర్ డా.సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎథిక్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె.చిట్టినరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డా.హరిచరణ్, ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఇంటర్నెట్ యుగంలో ప్రతి ఒక్కరూ చదువుకున్న వారేనని, ఏదైనా అనారోగ్య సమస్యతో వైద్యుల దగ్గరకు వస్తారని, విసుగుకోకుండా వైద్యం అందించాలన్నారు. డబ్బులకు ఆశపడి దొంగ సర్టిఫికెట్లు ఇవ్వరాదని, దీని వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని హెచ్చరించారు. ప్రతి వైద్యుడు ఏపీ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ విధిగా చేసుకోవాలని సూచించారు. వైద్యుడు ప్రిస్క్రిప్షన్‌లో మందు పేరు రాయాలని, కంపెనీ పేరు రాయకూడదని అన్నారు. రోగి తన వైద్యసేవల రికార్డును పొందే హక్కు ఉంటుందని, రోగి అడిగిన 72 గంటలలోపు అతనికి రికార్డు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

కేవీకేలో నైపుణ్య ఆధారిత ఇంటర్న్‌షిప్



శిక్షణకు హాజరైన అభ్యర్థులు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సింజెంట్ ఫౌండేషన్‌ఔ, జాతీయ వ్యవసాయ పరిశోధన మార్కెటింగ్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న నైపుణ్య ఆధారిత ఇంటర్న్‌షిప్‌ను సంయుక్త కార్యదర్శి రాఘవేంద్ర చౌదరి ప్రారంభించారు. ఈ కార్యక్రమం 40 రోజుల పాటు జరుగుతుందన్నారు. అభ్యర్థులకు స్టైఫండ్‌తో పాటు23 రోజుల పాటు క్లాస్‌రూం ప్రోగ్రామ్ ఉంటుందని, తర్వాత రెండు నెలల పాటు ఫీల్డ్‌లెవెల్ ట్రైనింగ్ ఉంటుందన్నారు. శిక్షణను పూర్తి చేసుకున్న వారికి సింజెంటా కంపెనీలో మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిజెంటా ట్రైనీ అసోసియేట్ శివరామరాజు పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఆదర్శప్రాయుడు దామోదరం సంజీవయ్య

● ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువలేనివి ● జయంతి వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు


నందికొట్కూరు రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య


నంద్యాలలో నివాళి అర్పిస్తున్న పోలీసు అధికారులు


నందికొట్కూరులో విద్యార్థినికి నగదు బహుమతిని అందజేస్తున్న విక్టర్

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొదటి దళిత ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొదటి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శప్రాయుడు అని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. సంజీవయ్య జయంతిని నందికొట్కూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దామోదరం చిత్రపటం వద్ద ఎమ్మెల్యేతో పాటు ఎంపీడీవో సుబ్రమణ్యశర్మ, టీడీపీ నాయకుడు మాండ్ర సురేంద్ర నాథరెడ్డి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య అడుగుజాడల్లో నడుద్దామని పిలుపునిచ్చారు. నిరాడంబర జీవితం గడిపిన తీరు ఆదర్శప్రాయమని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నందికొట్కూరు: మాజీ ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను నందికొట్కూరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ బేబి ఆధ్వర్యంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మున్సిపల్ డీఈ నాసీర్, టీపీవో రంగస్వామి, ఏఈ దినేష్ కుమార్, మెప్మా, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

● ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీల ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను పట్టణంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్యారడైజ్ ఫంక్షన్ హాలు వరకు ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి తమ్మెడపల్లి విక్టర్, అశోకరత్నం, మాలమహానాడు నాయకుడు రాజు, జయరాముడు, నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ సీఐ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల క్రైం: నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్.యుగంధర్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యుగంధర్‌బాబు దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని రైతు సేవా సంఘం కార్యాలయంలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని నిర్వహించారు. ఆ సంఘం నాయకులు మునీర్‌బాషా, రహంతుల్లా, మహెబూబ్‌బాషా పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో సంజీవయ్య జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, ఎంపీడీవో దస్తగిరి, ఈవోపీఆర్డీ రామకృష్ణవేణి, ఏవో శ్యామల, ఏపీవో వసుధ, సీనియర్ అసిస్టెంట్ చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

పాణ్యం: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు పాణ్యంలో నిర్వహించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంజీవయ్య చిత్రపటానికి పూల మాలవేసి నివాళి అర్పించారు. నాయకుడు ప్రతాప్, ఎస్ఎస్‌యూఐ నాయకులు రాజు, దేవరాజు, పుల్లయ్య, శ్రీరాం, సీఐటీయూ నాయకులు నాగరాజు, వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆత్మకూరులో..


బండిఆత్మకూరులో..


పాణ్యంలో..

'అవసరం మేరకే యూరియా వాడాలి'

వెలుగోడు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంటలకు అవసరం మేరకే యూరియాను ఉపయోగించాలని వ్యవసాయాధికారి పవన్ కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం వెలుగోడు రైతు సేవా కేంద్రం, సొసైటిలో జరుగుతున్న ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సిబ్బంది రామకృష్ణ, నాగమణి, వెంకటశివుడు, సొసైటీ సీఈఓ జంబులయ్య ఉన్నారు.

'యూరియా కొరత తీర్చాలి'

బండిఆత్మకూరు: ప్రభుత్వం తక్షణమే రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని మండల ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బండిఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ పద్మావతమ్మకు వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం నాయకుడు సుధాకర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డేవిడ్, రత్నమయ్య సుబ్బరాయుడు, రాజు, రత్నం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'వంద రోజుల పని కల్పించాలి'

గోస్పాడు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలని డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య అన్నారు. జిల్లాలో చాలా పంచాయతీల్లో జాబ్ కార్డులు ఉన్న వారికి వంద రోజులు పని కల్పించడం లేదని, తప్పని సరిగా కల్పించాలన్నారు. పనులు తక్కువగా కల్పించిన ఏపీవో, టీఏలకు మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. మార్చి నుంచి జాబ్ కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికి 200 రోజులు పనులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

'మద్యం దుకాణాన్ని తొలగించాలి'

నందికొట్కూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నివాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని సీపీఐ నాయకులు, తాలుకా ఆఫీస్ రోడ్డు కాలనీవాసులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సీపీఐ నాయకుడు రఘురామ్మూర్తి మాట్లాడుతూ పట్టణంలో అత్యంత రద్దీగా ఉన్న తాలుకా ఆఫీసు రోడ్డులో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడతారన్నారు. మద్యం దుకాణాన్ని ఇతర ప్రాంతంలో ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులుకు తహసీల్దార్ శ్రీనివాసులులకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు.

ఆర్జీఎం కళాశాలలో జాతీయ సాంకేతిక సదస్సు

పాణ్యం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో సంకల్ప్ రిపుల్ 2కె25 సాంకేతిక జాతీయ సదస్సు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు కోఆర్డినేటర్ తిరుపతి రెడ్డి తెలిపారు. సదస్సులో పేపర్ ప్రజంటేషన్, మెక్ టాక్ పేపర్ పర్‌సూట్, పోస్టర్ ప్రజంటేషన్, కోడింగ్, క్విజ్, డిజైన్, ప్రాజెక్ట్ ప్రీమియర్ తదితర పోటీలలో విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రిప్పుల్ సావనీర్‌లను ఆవిష్కరించారు. రెండు రోజుల పాటు ఈ సదస్సు జరుగుతుందని చెప్పారు. అలాగే ఐఈఈఈ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రవాహ రిపుల్ 2కె25 జాతీయ సదస్సు శుక్రవారం ముగిసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సదస్సులో 114 మంది సాంకేతిక పేపర్ ప్రజంటేషన్‌లో, 26 మంది ప్రాజెక్ట్ ప్రదర్శనలో, 95 మంది కోడింగ్ ప్రజంటేషన్‌లో 210 మంది క్విజ్ పోటీలలో పాల్గొన్నట్లు తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్ వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

'ప్రతి రైతుకూ గుర్తింపు సంఖ్య'

కొత్తపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు విశిష్ట గుర్తింపు కార్డు ఇవ్వనున్నట్లు ఏవో మహేష్ తెలిపారు. శుక్రవారం ఆయన దుద్యాల, శివపురం, ముసలిమడుగు గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది నిర్వహిస్తున్న రైతుల రిజిస్టర్ నమోదు సంఖ్య ప్రక్రియను పరిశీలించారు. రైతులు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

మహానందిలో శ్రీనిధి ఎండీ పూజలు

మహానంది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో రాష్ట్ర శ్రీనిధి ఎండీ హరిప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆలయ ముఖమంటపం వద్ద వీరికి సహాయ అర్చకుడు జనార్దన్‌శర్మ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకార్చనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో వేదపండితులు వీరిని శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు(చిన్నా), ఏఈఎంలు ఉమా మహేశ్వరరావు, నాగప్రసాద్‌పాల్గొన్నారు.

బార్‌లో ఘర్షణ.. యువకుడికి గాయాలు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో శుక్రవారం రెండు వర్గాలకు చెందిన యువకులు ఘర్షణకు పాల్పడ్డారు. బార్‌లో మద్యం మత్తులో బీరు సీసాలను పగులగొట్టి దాడులకు పాల్పడుతూ హల్‌చల్ చేశారు. ఈ ఘటనలో నౌమాన్‌నగర్‌కు చెందిన షహీన్‌షా తలపై బీరు బాటిళ్లతో దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వన్‌టౌన్ బ్లూకోల్ట్ పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన షహీన్‌షాను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తప్పతాగి బార్‌లో యువకులు హల్‌చల్ చేయడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.

'కార్మికులు నమోదు చేసుకోవాలి'

గడివేముల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కార్మికులు ఈశ్రం పోర్టల్ ద్వారా కార్డు నమోదు చేసుకోవాలని లేబర్ అసిస్టెంట్ కమిషనర్ బషీరున్నిసాబేగం, పరిశ్రమల జనరల్ మేనేజర్ జవహర్‌బాబు సూచించారు. గని గ్రామంలో వారు క్రస్సర్ మిషన్‌లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్మికులకు ఈశ్రం కార్డు వల్ల కార్మికులకు 60 ఏళ్లు దాటిన తరువాత పింఛన్ వస్తుందని అన్నారు. కార్మికులకు ప్రమాదా బీమా వర్తిస్తుందని అన్నారు. అనంతరం హైస్కూల్‌లో విద్యార్థులకు స్టడి మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఎంపీడీవో వాసుదేవగుప్తా, ఎంపీపీ నాగమద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పాటుపడాలి: డీటీవో

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు పాటు పడాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఐశ్వర్య రెడ్డి పిలుపు నిచ్చారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు 2025లో భాగంగా జిల్లా రవాణా శాఖ, పోలీస్ శాఖ, నంద్యాల ద్విచక్ర వాహన డీలర్లు, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. జాతీయ రహదారి చాపిరేవుల టోల్ ప్లాజావద్ద డీటీవో ఐశ్వర్యారెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆర్టీవో, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ

శ్రీశైలం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను వైభవంగా నిర్వహించారు. గ్రామదేవత అంకాలమ్మకు దేవస్థానం విశేష పూజలు నిర్వహించింది. నిత్యకళారాధన కార్యక్రమంలో శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన పూజా డ్యాన్స్ అకాడమీ వారితో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో శంకరా శ్రీగిరివాసా, ఏరదంతాయా, ఓం నమఃశివాయ, శివాష్టకం, కాలభైరవాష్టకం తదితర గీతాలకు, అష్టకాలకు కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు.

'పునరావాసం కల్పించాలి'


ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న టీడీపీ నాయకులు

గడివేముల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సోలార్ పరిశ్రమకు భూములు ఇచ్చిన రైతులకు పునరావాసం కల్పించాలని టీడీపీ నాయకులు మురళీమోహన్‌రెడ్డి, హర్షవర్ధన్ కోరారు. శుక్రవారం కర్నూలులోని గౌరు నివాసంలో ఎమ్మెల్యే చరితను కలిశారు. గని గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వం పునరావాసంపై దృష్టి పెట్టకపోవడంతో భూములు కోల్పోయిన రైతులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. గని చెరువులో చేపలు పట్టుకునేందుకు కొత్త వారికి సభ్యత్వం చేసుకునేందుకు అవకాశం కల్పించాలని అన్నారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో గని గ్రామ రైతులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని సిద్ధాపురం గ్రామ శివార్లలో నాటుసారా స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ శుక్రవారం తెలిపారు. గ్రామశివార్లలోని అటవీప్రాంతంలో సోదాలు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా ఆ గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో ఓ సారా స్థావరాన్ని గుర్తించి బట్టి వద్ద ఉన్న 1200 లీటర్ల బెల్లపు ఊటను, సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు వీరస్వామి, జగదీష్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడికి జైలు శిక్ష

మహానంది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బుక్కాపురం గ్రామానికి చెందిన ఈశ్వర్‌సింగ్ అనే యువకుడికి 7 రోజుల శిక్ష విధించినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గత రెండు రోజుల క్రితం రాత్రి వేళల్లో మద్యం మత్తులో బుక్కాపురం ప్రధాన రహదారి వెంట వెళ్తున్న ప్రయాణికుల పట్ల ఈశ్వర్‌సింగ్ అసభ్యకరంగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కోర్టుకు హాజరుపర్చగా మేజిస్ట్రేట్ 7 రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

దుకాణాల నిర్వహణకు వేలం

పాణ్యం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం టెంకాయలు, గాజుల అంగళ్ల నిర్వహణకు వేలంపాటలు నిర్వహించారు. ఈ వేలాల్లో రూ.20,96,500 ఆదాయం చేకూరినట్లు ఆలయ ఈవో రామకృష్ణ తెలిపారు. టెంకాయల అంగడిని రూ. 15.50 లక్షలకు రుద్రవరం మండలం నర్సాపురం నివాసి సుబ్రహ్మణ్యం దక్కించుకున్నట్లు తెలిపారు. పూల అంగడి నందివర్గం నివాసి సుధీర్‌కుమార్ రూ.4.77 లక్షలకు దక్కించుకున్నారని చెప్పారు. గాజుల అంగడి, పూల అంగడి కొత్తూరు నివాసి సుధీశ్వరరెడ్డి రూ.69 వేలకు దక్కించుకున్నట్లు తెలిపారు. గత ఏడాది కంటే అదనంగా రూ.1,37,500 అదనంగా చేకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ గ్రూపు దేవస్థానం ఈవో నరసయ్య, గ్రామ పెద్దలు శివరామిరెడ్డి, మిలిటరీ సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, పాటాదారులు పాల్గొన్నారన్నారు.

18న బహిరంగ వేలం

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రథమ నందీశ్వరస్వామి దేవస్థానానికి చెందిన మూలసాగరంలోని సర్వే నెంబర్ 453లో విస్తీర్ణం 3 ఎకరాలను 11ఏళ్లు లీజుకు ఇవ్వడానికి ఈనెల 18న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రామానుజం తెలిపారు. ఆలయ ఆవరణలో దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ అజాద్ పర్యవేక్షణలో ఈ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. రూ.5 లక్షలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

పాఠశాల క్రీడా స్థలం సర్వే

పాణ్యం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని శుక్రవారం సర్వే నిర్వహించారు. ఎమ్మెల్యే గౌరు చరిత ఆదేశాల మేరకు పాఠశాల స్థలాన్ని సర్వే చేస్తున్నట్లు తహశీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పాఠశాల ప్రహరీ నిర్మాణంలో భాగంగా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ప్రహరీకి నిధులు మంజూరైనట్లు మాజీ ఉపసర్పంచ్ రమణమూర్తి తెలిపారు. హైవేఅథారిటీ కి చెందిన స్థలంతోపాటు క్రీడా మైదానంలోని 54 సెంట్లు హైవే నిర్మాణంలో కోల్పోయినట్లు తెలిపారు. దీంతో స్థలం కొలతల్లో సందిగ్దత ఏర్పడినట్లు ఆయన తెలిపారు. మండల సర్వేయరు నాగరాజు, సెక్రటరీ శివకుమార్, హైవే సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి'



మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫయాజ్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్ సూచించారు. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శక్రవారం జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 5 కంపెనీలు 52 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకా శాలు కల్పించాయని చెప్పారు. ప్రిన్సిపాల్ ఎన్.శశికళ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుబ్బన్న, స్కిల్ హబ్ సమన్వయ కర్త మస్తానవలి, 36వ వార్డు ఇన్‌చార్జి మారుతి ప్రసాద్, అయ్యాలూరు మాజీ సర్పంచ్ త్రిలేంగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

'పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

సున్నిపెంట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన డొక్క సీతమ్మ భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు బిల్లులు వెంటనే చెల్లించాలని ఏపీ మిడ్‌డే వర్కుస్ యునియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రమేశ్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీశైలం, సున్నిపెంట ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పులిరాజు, నాయకులు జ్యోతి, సుగునమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

'పౌష్టికాహారం తీసుకోవాలి'


గాజులపల్లిలో విద్యార్థులకు కంటి అద్దాలను అందజేస్తున్న వైద్యాధికారి కృష్ణమోహన్‌రెడ్డి

మహానంది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోషక విలువలు కల్గిన ఆహార పదార్థాలు తీసుకుంటే దృష్టి లోపం లేకుండా ఉంటారని జిల్లా అంధత్వ నివారణ సంఘం కంటి వైద్యాధికారి జి. కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. గాజులపల్లి జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న 22 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేసారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,68,996 పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 21,969 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు నిర్ధారించి వారిలో ముఖ్యంగా 3,961 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.వెంకటరెడ్డి, హెచ్ఎం రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: విద్యార్థులు కంటి జబ్బులపై నిర్లక్ష్యం వహించవద్దని వైద్యాధికారి ప్రణీత్, కంటి వైద్య నిపుణుడు వేణుగోపాల్‌లు సూచించారు. వెలుగోడు ఏపీ మోడల్ స్కూల్‌లో 46 మంది , కేజీబీవీలో ఐదుగురు విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నళిని, కేజీబీవీ ఎస్ఓ శ్రీనిజ, ఎంపీహెచ్ ఈవో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: పౌష్టికాహారంతో దృష్టి లోపాలను నివారించవచ్చునని కంటి వైద్య నిపుణుడు షేక్షావలి తెలిపారు. శుక్రవారం కొత్తపల్లి కేజీబీవీలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ఉచితంగాత కంటి అద్దాలు పంపిణీ చేశారు. వైద్యాధికారి దీపానాగవేణి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయిని రామలక్ష్మి, సూపర్‌వైజర్ దేవ కరుణమ్మ, సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్, హెల్త్ అసిస్టెంట్ జ్యోతి, లక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

● మంత్రి లోకేశ్‌కు చిన్న వెంకటస్వామి వినతి


మంత్రి నారా లోకేశ్‌తో చిన్నవెంకటస్వామి

నందికొట్కూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమకు గేట్‌వే గా ఉన్న నందికొట్కూరు నియోజకవర్గం నీటి ఎద్దడితో అల్లాడిపోతోందని, నీటి సమస్యను పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.కాకరవాడ చిన్న వెంకటస్వామి కోరారు. శుక్రవారం విజయవాడలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి నియోజకవర్గంలోని తాగు, సాగునీటి సమస్యలను పరిష్కరించాలన్న వివిధ అంశాలపై ఆయన వినతిపత్రం సమర్పించారు. చిన్నవెంకటస్వామి మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలోని శ్రీశైలం జలాశయం బ్యాక్ వాటర్‌ను రాయలసీమలోని అన్ని జిల్లాలకు తరలిస్తూ నియోజకవర్గంలో తాగు, సాగునీటి ఎద్దడి ఎదుర్కొంటోందన్నారు. కొత్తపల్లి మండలంలోని జడ్డువారి పల్లి వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని, దీని ద్వారా 3 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. మిడ్తూరు ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయడం ద్వారా మిడ్తూరు, కలమందలపాడు, మద్దిగుండం, పారుమంచాల చెరువులను నీటితో నింపవచ్చన్నారు. తద్వారా మండలంలోని 22 వేల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు జూపాడుబంగ్లా మండలంలో 60 వేల మంది ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. సంగమేశ్వర ఎత్తిపోత పథకం నిర్మాణ ప్రణాళిక లోపంతో పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరు అందడం లేదన్నారు. నాగటూరు ఎత్తిపోతల పథకం పైపులైను లీకేజీలతో నీరు వృథా అవుతుందన్నారు. అలగనూరు రిజర్వాయర్ గత నాలుగు సంవత్సరాలుగా గండిపడి మరమ్మతులకు నోచుకోవడం లేదన్నారు. రిజర్వాయర్‌కు మరమ్మతులు చేసి నియోజకవర్గ రైతులను, ప్రజలను ఆదుకోవాలని నారా లోకేశ్‌కు విన్నవించినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

పాణ్యం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు మెట్ట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థిని మృతి చెందినట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. బలపనూరుకు చెందిన మహేశ్వరరెడ్డి ఎస్‌డీఆర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న తన కూతురు వైష్ణవితో పాటు మరో బాలిక పూజితను మోటారు సైకిల్‌పై గ్రామానికి తీసుకెళ్తూ జాతీయ రహదారి దాటుతుండగా ఓ ఫోర్ వీలర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురూ గాయపడ్డారు. వీరిని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే రాజశేఖర్‌రెడ్డి, కళావతి దంపతుల కూతురు పూజిత(16) చికిత్స పొందుతూ మృతి చెందింది. మహేశ్వరరెడ్డి, వైష్ణవికి గాయాలయ్యాయినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

జాతీయ క్రీడాకారులకు అభినందన

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్న క్రీడాకారులు కిరణ్, మల్లికార్జున లను జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఛైర్మన్ షేక్షావలిరెడ్డి, కార్యదర్శి బాబు ప్రత్యేంగా అభినందించారు. జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులకు క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉందని వారు అన్నారు.

'ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు'


సూచనలు ఇస్తున్న ఐటీడీఏ పీవో శివప్రసాద్

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల కోసం ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని శ్రీశైలం ఐటీడీఏ పీవో కె.వెంకట శివప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని బైర్లూటి గూడెంలోని ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు అభ్యసన సామగ్రి ప్యాడ్‌లు, పుస్తకాలు, నోట్ బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులకు సులభతరమైన బోధనా సరళి ద్వారా బోధించాలని సూచించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ షేక్ ఖజా, ఉపాధ్యాయులు ఉన్నారు.


అన్నాభిషేకం అలంకారంలో ఈశ్వరస్వామి



శివాలయంలో ఈశ్వరస్వామికి పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో అన్నాభిషేకం అలంకారంలో ఈశ్వర స్వామి కొలువుదీరారు. మాఘ మాసం సందర్భంగా మహిళలు సామూహికంగా ఈశ్వరస్వామిని అన్నాభిషేకం అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేశారు. శివమాల ధరించిన శివస్వాములు శివపార్వతులకు పూజలు నిర్వహించి భజనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నమో నారసింహా..



మందలూరులో పూజలందుకుంటున్న పార్వేట ఉత్సవమూర్తులు

రుద్రవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నమో నారసింహా.. అంటూ భక్తులు మందలూరు గ్రామంలో ప్రత్యేక పూజలు చేశారు. పార్వేట పల్లకీలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీ నరసింహ స్వామి, ప్రహ్లాద వరద స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఉత్సవమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సరిహద్దుల్లో పార్వేట పల్లకీకి గ్రామ పెద్దలు స్వాగతం పలికారు. కార్యక్రమంలో వీఆర్వో చంద్రమోహన్, పంచాయతీ కార్యదర్శి ఆదిలక్ష్మి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి



డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంవీఐ రవి శంకర్

శిరివెళ్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని నంద్యాల జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవి శంకర్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వ ర్యంలో మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెల్మెట్ ఆవశ్యకతపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి, రెడ్ రిబ్బన్ క్లబ్ సెక్రటరీ కృష్ణమూర్తి, అధ్యాపకులు జనార్దనుడు, సంజయ్, శ్రీనివాస రావు, సిబ్బంది శివ ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

అమరవీర జవాన్లకు అశ్రు నివాళి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో 2019, ఫిబ్రవరి 14న భారత భద్రతా దళాలపై ఉగ్రవాదులు జరిపిన దాడులలో అసువులుబాసిన అమరవీర జవాన్లకు ప్రైవేట్ పాఠశాలల ఆళ్లగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్ బాషా, విద్యార్థులు శుక్రవారం నివాళి అర్పించారు. పట్టణంలోని కేవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలలో డైరెక్టర్ భూమా శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ ఓబన్న ఆధ్వర్యంలో అమరవీర జవానుల చిత్రపటాలకు పూల మాల వేశారు. కార్యక్రమంలో ఆపోసా ఆళ్లగడ్డ టౌన్ అధ్యక్షుడు జీవీ సుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాల ఖ్యాతిని చాటాలి

సంజామల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల ఖ్యాతిని చాటాలని పూర్వ విద్యార్థి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెండేకంటి కిరణ్ కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన జాబ్‌మేళాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాలలో చదువుతున్న 44మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, బస్‌పాస్‌కు సంబంధించి తన సొంత నిధులు రూ. 63,200 చెక్కును మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అందజేశారు. జాబ్‌మేళాలో 19మందికి ఉద్యోగాలు వచ్చినట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శివారెడ్డి, నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

శర వేగంగా రోడ్ల నిర్మాణాలు: ఎస్ఈ

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రహదారుల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయని రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం కొలిమిగుండ్ల, అవుకు, సంజామల మండలాల్లోని పలు రహదారులను పరిశీలించారు. పేరుసోముల-పెట్నికోట రహదారికి రూ.30కోట్లు, అంకిరెడ్డిపల్లె - తిమ్మనాయినిపేట రహదారికి రూ.30కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు ఎస్ఈ తెలిపారు. కార్యక్రమంలో ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఏఈ శ్రీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17న అంగన్‌వాడీ వర్కర్ల ధర్నా

డోన్ టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న ఐసీడీఎస్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.శివరాం సూచించారు. శుక్రవారం ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో శంషాద్ బేగానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

డోన్ టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే 2025-26 విద్యాసంవత్సరానికి జూనియర్ ఇంటర్మీడియట్, 5వ తరగతి బ్యాక్‌లాగ్ అడ్మిషన్ల కోసం శనివారం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్ ప్రిన్సిపాల్ వసుంధరా దేవి శుక్రవారం తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో, బ్యాక్‌లాగ్ అడ్మిషన్లు 6, 7, 8, 9 ఇంగ్లీషు మాధ్యమంలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు నేటి నుంచి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు.

వ్యక్తిపై ఫిర్యాదు

ప్యాపిలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను సోషల్‌మీడియాలో విమర్శించిన ధనుంజయ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు కోరారు. శుక్రవారం మండలంలోని జలదుర్గం ఎస్ఐ నాగార్జునకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డోన్ జనసేన నాయకులు గడ్డం బ్రహ్మం, మధు నాయుడు, సునీల్, పుల్లయ్య, రంగారెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండాలి

బనగానపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండాలని జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య అన్నారు. శుక్రవారం ఆయనను ఆర్యవైశ్యులు సత్కరించారు. కార్యక్రమంలో జక్కా శ్రావణ్, నాగరాజు, సాయిరాం, శ్రీరామ వెంకట సుబ్రహ్మణ్యం, కాసు జంగంశెట్టి, బింగిమళ్ల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

రుద్రవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన సమయంలో సమయపాలన పాటించాలని డీఎల్‌డీవో శివారెడ్డి అన్నారు. శుక్రవారం రుద్రవరంలోని 1, 2, 3 సచివాలయాలను, నరసాపురం, ముత్తలూరు సచివాలయాలను తనిఖీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిని మందలించారు.

ఇరుకు మైదానం.. ఆటలకు ఆటంకం

- ఇది ఆలమూరు ఉన్నత పాఠశాలలో క్రీడా ప్రాంగణం దుస్థితి

రుద్రవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడుతాయి. అలాంటివి పలు ప్రభుత్వ పాఠశాలలో సరైన వసతులు లేక మరుగున పడుతున్నాయి. మరికొన్ని చోట్ల మైదానాలు ఉన్నా ఇరుకుగా ఉండటంతో విద్యార్థులు ఆడుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని ఆలమూరు ఉన్నతపాఠశాలలో 510 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలలో క్రీడా మైదానం విశాలంగా లేకపోవడంతో విద్యార్థులు ఆటలు ఆడిన ప్రతిసారి గాయాల పాలవుతున్నారు. దాంతో విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు విముకత చూపుతున్నారు. పాఠశాలకు కొంత దూరంలో సర్వే నెంబరు 404లో 5.06 ఎకరాల్లో క్రీడామైదానం ఏర్పాటు చేశారు. పాఠశాలకు అరకిలోమీటరు దూరంలో ఉండటంతో విద్యార్థులకు శాపంగా మారింది. అక్కడికి వెళ్లేందుకే కేటాయించిన సమయం సరిపోవడంలేదు. క్రీడామైదానం నిరుపయోగంగా మారింది. దాంతో మైదానం మొత్తం చెత్త, పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. ఉన్నతాధికారులు పాఠశాలల క్రీడామైదానాల పై దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.



ఆలమూరు ఉన్నత పాఠశాల



పాఠశాలకు దూరంగా ఏర్పాటు చేసిన క్రీడా మైదానంలో పెరిగిన పిచ్చి మొక్కలు

ఇబ్బందిపడుతున్నాం



పాఠశాలలో మైదానం ఇరుకుగా ఉన్నది. దాంతో ఆడుకోలేకపోతున్నారు. కబడ్డీ ఆడాలంటే ఇబ్బందిగా ఉంది. చాలు సార్లు ఆడి కిందపడ్డాను. పాఠశాలకు సమీపంలోనే విశాలమైన స్థలం ఏర్పాటు చేయాలి.

- ముబీనా, 9వ తరగతి విద్యార్థిని

విద్యార్థులు గాయపడుతున్నారు



ఆలమూరు ఉన్నతపాఠశాలలో 3వతరగతి నుంచి పదో తరగతి వరకు 510 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. క్రీడా మైదానం ఇరుకుగా ఉన్నది. దాంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. ఈ విషయా న్ని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం.

- అనురాధ, హెచ్ఎం

ప్రతి హామీ నెరవేరుస్తా : మంత్రి బీసీ

సంజామల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ముదిగేడు సంజామల డబుల్ రోడ్డు నిర్మాణానికి సంజామల వేరుహౌస్ వద్ద ఆయన భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, ఈఈ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ మాట్లాడుతూ గుంతలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు ద్వారా రూ.1080 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 3000 కిలోమీటర్ల రోడ్ల పనులు ప్రారంభించామన్నారు. ఒక్క బనగానపల్లె నియోజకవర్గంలోనే గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. త్వరలో పేదలకు ఇళ్ల పట్టాలు, జలజీవన్ మిషన్ ద్వారా రక్షిత మంచినీరు తదితర పథకాలను అందుబాటులోకి తెస్తామన్నారు. ముదిగేడు నుంచి సంజామల వరకు అధ్వానంగా ఉన్న ఆరు కిలోమీటర్ల రహదారికి నాడు నేడు నిధులు తెచ్చింది నేనే అని బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి బత్తుల వెంకట ప్రతాప్ రెడ్డి, ఎంపీడీవో సాల్మన్, తహసీల్దారు అనిల్ కుమార్, సునీల్ రెడ్డి, రెడ్డి గోవిందు, ఏవో సుధాకర్ రెడ్డి, ఏపీవో ప్రకాష్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

పారిశుధ్య కార్మికులకు అదనపు వేతనం పంపిణీ

బనగానపల్లె: పట్టణంలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు అదనపు వేతనం శుక్రవారం రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పంపిణీ చేశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉత్సాహంగా కార్మికులు పని చేయాలని కోరారు. తమకు అదనంగా వెయ్యి వేతనం పెంచిన మంత్రి బీసీకి పారిశుధ్య కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

డోన్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రంలో జాతీయ అంధత్వ నియంత్రణ కార్యక్రమం జరిగింది. దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించారు. వారికి ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ కంటి జాగ్రత్తలు తీసుకోవాలని, దృష్టి లోపం ఉన్న వారు కళ్లజోడులు వాడాలని, బాగా చదివి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు షబాజ్ హుశేన్, భూపాల్, మహర్షి, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులకు కంటి అద్దాలు అందిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

నేడు ఎమ్మెల్యే కోట్ల రాక

ప్యాపిలి: పట్టణానికి శనివారం డోన్ ఎమ్మెల్యే కోట్ల ప్రకాష్‌రెడ్డి రానున్నట్లు శుక్రవారం పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విశ్రాంతి భవనంలో ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించనున్నట్లు తెలిపాయి. ప్రజలు సమస్యలపై వినతులు ఇవ్వవలసింగా పార్టీ వర్గాలు కోరాయి.

పకడ్బందీగా నిర్వహించాలి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని దీనిని గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులు పకడ్బందీగా చేపట్టాలని నంద్యాల జిల్లా పంచాయతీ అధికారి షేక్ జమీవుల్లా అన్నారు. శుక్రవారం పట్టణంలోని మేజరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని డీపీవో తనిఖీ చేశారు. పట్టణంలోని సంతపేట వెళ్లే రహదారిలో జరుగుతున్న డ్రైనేజీ పనులను ఎస్‌డబ్ల్యూపీసీ సెంటరు, పార్కులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవెలకుంట్ల మేజరు గ్రామ పంచాయతీలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అవినీతికి పాల్పడుతున్నారని కొందరు రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేశారని, అధికారుల ఆదేశాల మేరకు ఈఓ ఆర్‌డీపై విచారణ చేపట్టామని అన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదికను కలెక్టరుకు పంపుతామని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల కార్మికులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



చెత్త సంపద కేంద్రం పరిశీలిస్తున్న డీపీవో షేక్ జమీవుల్లా

నేడు యాగంటిలో వేలం

బనగానపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్రంలో శనివారం వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో చంద్రుడు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు మరుగుదొడ్ల నిర్వహణ లైసన్సు హక్కు కోసం బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు రూ.10వేలు చెల్లించి టెండరులో పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు యాగంటి క్షేత్రం ఈవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా టెక్కెస్వామి ఉరుసు

అవుకు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కునుకుంట్ల గ్రామ సమీపంలో వెలసిన టెక్కెస్వామి దర్గాలో ఉరుసు ఘనంగా శుక్రవారం నిర్వహించారు. టీడీపీ నాయకులు గూడాల శివరామిరెడ్డి, ప్రతాప్ రెడ్డి మురళీధర్‌రెడ్డి టెక్కెస్వామి దర్గా వద్దకు చేరుకొని పూజలు చేశారు. అన్నదానం చేశారు. శనివారం జియారత్ కార్యక్రమంతో ఉరుసు ముగియనున్నాయి.

కార్మికులకు అవగాహన కల్పించాలి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వివిధ వర్గాల కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్మికశాఖ అధికారి శోభారాణి , పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు బాస్కరరెడ్డి, వెంకటసుబ్బయ్య, వెంకటేష్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలి

బనగానపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు దస్తగిరి, మారం నాగరాజు, మద్దిలేటి, స్వామి దాసు, ముక్కమళ్ల బెన్నీ, ఓబులేసు, శ్రీనివాసులు, ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

శిరివెళ్ల : దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయమని ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప అన్నారు. దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా శిరివెళ్లలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శుక్రవారం నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

డోన్ రూరల్: పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్టు హౌస్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మండల కార్యదర్శి వెంకటనాయునిపల్లె శ్రీనివాసులు , నాయకులు వలసల బాలుడు, గుండాల ఈశ్వరయ్య, గురిమిట్ల నారాయణ, గార్లపాటి మద్దిలేటి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



బనగానపల్లెలో దామోదరం సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

డోన్ టౌన్: పట్టణంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జి.వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ ఫక్రుద్దీన్ సాహెబ్, సీనియర్ సూపరింటెండెంట్ కాశీ విశ్వనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రైతుల సంక్షేమం కోసమే భూ రీసర్వే

- నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్



చాగలమర్రి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసమే భూరీసర్వేను ప్రభుత్వం తిరిగి ప్రవేశ పెట్టిందని, భూ సమస్యలను పరిష్కరించేందుకు రీసర్వే చేస్తున్నామని నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్ అన్నారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని భూరీసర్వేను పైలెట్ ప్రాజెక్టు ద్వారా రీసర్వే ప్రారంభించినట్లు తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతితో ఆర్డీవో మాట్లాడారు.

ప్రశ్న: డివిజన్‌లో ఎన్ని మండలాల్లో రీసర్వే జరుగుతోంది?

జవాబు: 13 మండలాల్లో ఆయా గ్రామాల్లో జనవరి నుంచి రీసర్వే ప్రారంభించాం.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని టీమ్‌ల ద్వారా సర్వే చేస్తున్నారు?

జవాబు: 13 టీమ్‌ల ద్వారా గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. ఒక్కోక్క గ్రామంలో 20 నుంచి 25 ఎకరాలు మాత్రమే గ్రామ సర్వేయర్లు సర్వే చేస్తారు.

ప్రశ్న: భూరీసర్వే రైతుల సమక్షంలో చేస్తున్నారా?

జవాబు: మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో ఏడు బ్లాక్‌లుగా విభజించడం, రెండు టీమ్‌ల ద్వారా సర్వే చేస్తున్నాం. రైతులకు ముందుగా నోటీసులు ఇచ్చి వారి సమక్షంలో రోవర్ ద్వారా సర్వే చేస్తారు.

ప్రశ్న: జగనన్న లేఔట్‌లలో ఆగిన ఇళ్ల స్థలాల సర్వే చేస్తున్నారా?

జవాబు: జగనన్న లేఔట్‌లలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోకుండా నిలిపి వేసిన స్థలాలు, బేస్‌మెంట్‌లను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తాం. లబ్ధిదారులకు ఇచ్చిన ఇంటి పట్టాలను అమ్ముకోవడానికి వీలు లేదు. అలా చేసి ఉంటే ఆ పట్టాను రద్దు చేస్తాం.

ప్రశ్న: గ్రామాల్లో రేషన్ సక్రమంగా జరుగుతుందా?

జవాబు: గ్రామాల్లో ఇంటింటికి రేషన్ ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేస్తున్నాం. కార్డుదారుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం.

18న రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

చాగలమర్రి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లెలో 18న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి ఒంగోలుజాతి బండలాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పులి చిన్న ఓబుళరెడ్డి శుక్రవారం తెలిపారు. న్యూ క్యాటగిరి విభాగానికి చెందిన వృషభములకు ఈ పోటీలు ఏర్పాటు చేశామని అన్నారు. దాతలు ముల్లా షబ్బీర్ అహ్మద్, మోహన్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, మహమ్మద్‌రఫి, వెంకటమోహన్‌రెడ్డి, ఎంఈవో సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రఫి బహుమతులు అందజేస్తారని తెలిపారు. ఈ పోటీలో పాల్గొనే యజమానులు రూ.1,000 రుసుము చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

23న ఆధ్యాత్మిక, పౌరాణిక అంశాలపై పోటీలు

చాగలమర్రి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి వాసవీ డిగ్రీ కళాశాలలో ఈనెల 23న ఆళ్లగడ్డ నియోజకవర్గ స్థాయిలో ఆధ్యాత్మిక, పౌరాణిక విషయాలపై పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వేముల పోలిశెట్టి తెలిపారు. రామాయణం, మహాభారతం, భాగవతం, పురాణా విశేషాలపై 108 ప్రశ్నలకు పోటీ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు దాతలు ద్వారా బహుమతులు అందజేస్తారని అన్నారు. 20వ తేదీ లోపు పోటీ పరీక్షలో పాల్గొనేవారు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

పాల పదార్థాల విక్రయ కేంద్రం ప్రారంభం

చాగలమర్రి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి టోల్ ప్లాజా సమీపంలోగల హైవేలో ఏర్పాటు చేసిన పాల పదార్థాల విక్రయ కేంద్రాన్ని నంద్యాల విజయ పాలడైయిరీ డిప్యూటీ డైరెక్టర్ మహబూబ్‌వలి, మార్కెటింగ్ మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. రూ.10 లక్షలతో చేపట్టిన పాల పదార్థాల కేంద్రంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డీజీఎం విశ్వనాథ్, టీసీవో ప్రకాష్‌రెడ్డి, డైయిరీ మేనేజర్ ఈశ్వరయ్య, సిబ్బంది నాగరాజు, వీరన్న, ఉసేన్‌వలి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి పైపులు చోరీ

ప్యాపిలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు సమీపంలో ఏర్పాటు చేసిన హంద్రీనీవా సుజల స్రవంతి పథకానికి సంబంధించిన పైపులను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో గుడిపాడు చెరువుకు నీరు సరఫరా కావడంలేదని ఆ గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వెంగళాంపల్లి, ప్యాపిలి, ఏనుగమర్రి గ్రామాల్లోని చెరువులకు నీరందించారు. అయితే పైపులైన్ ధ్వంసం చేసి వాటిని అపహరించుకొని పోవడం వలన చెరువు నీరందడం లేదని రైతులు తెలిపారు. అధికారుల స్పందించి చోరీకి గురైన ప్రాంతంలో కొత్త పైపులు ఏర్పాటు చేసి చెరువు నీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ డీఈవో

డోన్ టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): డోన్ డివిజన్ ఉప విద్యాధికారిగా వెంకట్రామిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ డీఈవో వెంకట్రామిరెడ్డికి ఎంఈవోలు ప్రభాకర్, రామప్ప, వెంకటసుబ్బయ్య, హెచ్ఎంలు సురేష్‌బాబు, వెంకటసుబ్బారెడ్డి, ఎస్ఎస్ బాబు, మాణిక్యం శెట్టి, లక్ష్మినాయక్, బీవై సుబ్బరాయుడు, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

'కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం'

డోన్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆం ధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం పట్టణ మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్ ధ్వజమెత్తారు. శుక్రవారం కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా డోన్- బేతంచెర్ల రోడ్డులో నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు రామాంజనేయులు, బాస్కర్ రెడ్డి, నక్కి హరి పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా రీ సర్వే: ఆర్డీవో

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల రెవెన్యూ డివిజన్ పరిధిలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన 13 గ్రామాల్లో రీసర్వే పనులు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం మండలంలో పైలె ట్ ప్రాజెక్టు కింద ఎంపికైన కల్వటాల గ్రామంలో రీ సర్వే పనులను ఆర్డీవో పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలీశ్వరరెడ్డి, మండల సర్వేయర్ సరిత, సీనియర్ అసిస్టెంట్, వీఆర్వోలు ప్రసాద రెడ్డి, భార్గవి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలే ట్రాయ్ లక్ష్యం

బనగానపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): టెలికాం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్ లక్ష్యమని ట్రాయ్ కాగ్ సభ్యుడు బత్తుల సంజీవరాయుడు అన్నారు. శుక్రవారం బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టెలికం వినియోగదారుల అవగాహన సదస్సును పీఎస్ఎస్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహమ్మద్‌గౌస్, బీఎస్ఎన్ఎల్ జేటీవో వెంకటేశ్వర్లు, అమీర్ బాష, లాయర్ రఘురామిరెడ్డి, బ్రహ్మానందాచారి పాల్గొన్నారు.

ఘనంగా పల్లకి సేవ ఉత్సవాలు

బనగానపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం మాతవారి పల్లకి సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.